సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ప్రవీణ్



బెల్లంపల్లి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా బెల్లంపల్లికి చెందిన రేణికుంట్ల ప్రవీణ్‌ను సీఎం కేసీఆర్ నియమించారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బెల్లంపల్లి నుంచి పోటీకి టీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నించారు. ఈసారీ టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో నిరాశలో ఉన్న ఆయనను ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమిస్తూ సముచిత ప్రాధాన్యత కల్పించారు.



కార్మికుల ఖాతాల్లోకి ఏరియర్స్

సింగరేణి కార్మికుల ఖాతాల్లో 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23నెలల ఏరియర్స్ డబ్బులు గురువారం ఒకే దఫాలో జమ చేశారు. ఈ మేరకు కార్మికులకు చెక్కులు అందజేశారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

వాతావరణం

జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా గాలులు వీస్తాయి.

విష జ్వరాల పంజా

గ్రౌండ్ రిపోర్ట్

ఒకే యంత్రంతో ఫాగింగ్



మున్సిపాలిటీకి వెళ్లే దారిలో ఇళ్ల మధ్యలో నీళ్లతో నిండి పెరిగిన గడ్డి

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలో రెండు ఫాగింగ్ యంత్రాలు ఉండగా ఒకటి పని చేయడం లేదు. దీంతో ఒకే యంత్రంతో ఫాగింగ్ నిర్వహిస్తున్నారు. అన్ని వార్డుల్లో ప్రతీ రోజు ఫాగింగ్ చేయకపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. పలు వార్డుల్లో ఇళ్ల మధ్య ఉన్న ఓపెన్ ప్లాట్లు మురికి కూపాలుగా మారి దోమలకు నివాస కేంద్రాలుగా మారాయి. దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు, డెంగీకి కారణమవుతున్నాయి. పట్టణంలో సీజనల్ వ్యాధులు క్రమంగా పెరుగుతున్నాయి. వర్షాలు అధికంగా కురువడంతో నీరు కలుషితమై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటివరకు ఆరు డెంగీ పాజిటీవ్ కేసులు నమోదైనట్లు నస్పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సమత తెలిపారు. ఆస్పత్రిలో రోజురోజుకు ఓపీ పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. గతంలో రోజుకు 50 నుంచి 60 మంది రోగులు వచ్చేవారు ప్రస్తుతం రోజుకు 100కు పైగా వస్తున్నారు. ఎక్కువగా టైఫాయిడ్ కేసులు నమోదు అవుతున్నాయి. జ్వర బాధితులు ఎక్కువగా ఉన్న ఏరియాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని వైద్యులు తెలిపారు.



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

- జిల్లాలో 55 డెంగీ కేసులు నమోదు
- 89,500 మందికి మలేరియా పరీక్షలు
- 19,800 మందికి జ్వర సంబంధిత వ్యాధులు
- మున్సిపల్, పంచాయతీల్లో కానరాని నియంత్రణ

మంచిర్యాలటౌన్: జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతీ ఇంట్లో ప్రజలు జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతుండగా.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధులు అధికంగా నమోదు అవుతుండడం గమనార్హం. ప్రతియేటా డెంగీ కేసులు నమోదవుతున్నా దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు కలిసి పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం, బ్లీచింగ్ పౌడర్ చల్లి, నీరు నిల్వ లేకుండా చేయడం, దోమలు వృద్ధి చెందిన చోట దోమల మందు చల్లడం, డెంగీ వంటి కేసులు నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి, వారికి డెంగీ ఎలా సోకిందో నిర్ధారణ చేసుకుని, చుట్టు పక్కల వారికి రాకుండా చర్యలు తీసుకోవడం వంటివి చేపట్టాలి. ఇందుకోసం ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వమే పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాలు ఏటా నిర్వహిస్తున్నా ఈ ఏడాది వాటి ఊసే లేదు. వాతావరణంలో మార్పులు, వర్షాలు కురవడం, ఎండలతో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి దోమల వృద్ధికి ఆవాసంగా మారుతున్నాయి. దీంతోనే విషజ్వరాలతోపాటు డెంగీ, రక్తకణాలు తగ్గిపోవడం సమస్యగా మారుతోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలకు అవకాశం లేకపోవడం, రక్తకణాలు తగ్గిన వారి రక్త నమూనాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు పంపించి ఎలిసా టెస్టు ద్వారా డెంగీ నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. కానీ రక్త కణాలు తగ్గిన వారికి ప్రైవేటులో డెంగీ పేరిట వైద్యం అందిస్తున్నారు. రూ.లక్షల్లో ఖర్చు అవుతుండడం, ఏది విష జ్వరమో, ఏది డెంగీ జ్వరమో తెలియక ప్రజలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారు.

జిల్లాలో నమోదైన సీజనల్ వ్యాధుల వివరాలు

విష జ్వరాలు	89,500
డెంగీ	55
డయేరియా	2,780
టైఫాయిడ్	1,269
జ్వర సంబంధిత వ్యాధులు	19,800

వ్యాధుల నియంత్రణకు చర్యలు



జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే వైద్య సిబ్బంది వ్యాధుల బారిన పడిన వారికి చికిత్స, మందులు అందిస్తున్నారు. వ్యాధులు ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా వస్తున్నాయో గుర్తించి ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

నివారణ చర్యల్లో నిర్లక్ష్యం

- విపరీతంగా పెరిగిన దోమలు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రి



చెన్నూర్‌లో ఖాళీ ప్లాట్ల నుంచి వెళ్తున్న నీరు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో జ్వరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాడ వాడల్లో ఇంటికొకరు జ్వరంతో బాధ పడుతున్నారు. జ్వర బాధితులతో చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం కిటకిటలాడుతోంది. జ్వరాల బారిన పడిన రోగుల్లో రక్తకణాలు తగ్గుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్ వంటి పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు 80 నుంచి 90 మంది వరకు, ప్రైవేట్, పట్టణ ప్రాంతాల్లో వందలాది మంది చికిత్స పొందుతున్నారు. వైరల్ జ్వరాలు సోకిన వందలో 70 శాతం మంది దగ్గు, జలుబు సమస్యతో బాధపడుతున్నారు. చికిత్స పొందుతున్నా జ్వరం తగ్గుముఖం పట్టకపోగా, దగ్గుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన దోమలు..

మున్సిపాలిటీలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు అడవులను తలపిస్తున్నాయి. ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు నిలువడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దోమలు స్వైర విహారం చేస్తూ వైరల్ జ్వరాలకు కారణమవుతున్నాయి.

సీహెచ్‌సీలో నమోదైన జ్వరాల వివరాలు

తేదీ	బాధితులు		
16	80	19	90
17	85	20	93
18	83	21	92

పారిశుధ్యం అస్తవ్యస్తం

- మంచిర్యాల మున్సిపాలిటీలో పెరుగుతున్న డెంగీ
- విష జ్వరాల బారిన ప్రజలు
- అంతంత మాత్రంగానే అధికారుల చర్యలు



శ్రీనివాస కాలనీలో డ్రైయినేజీ నిర్మించక పోవడంతో ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీరు

మంచిర్యాల మున్సిపాలిటీలో నమోదైన డెంగీ కేసులు

సంవత్సరం	సంఖ్య
2021	22
2022	35
2023(ఇప్పటి వరకు)	11

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. శివారు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండగా.. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్లు, ఖాళీ స్థలాల్లో ప్రవహిస్తూ దోమల వృద్ధికి కారణంగా మారుతోంది. పట్టణంలోని అన్ని వార్డుల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టాల్సి ఉన్నా రెగ్యులర్‌గా చేయకపోవడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 10 గంటలకు పది నిమిషాలు అనే కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో పాలకులు, అధికారులు చేపట్టి ప్రజలతో చేయించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు. డ్రెయినేజీల్లోని పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు డ్రెయినేజీల్లో నుంచి వెళ్లకుండా రోడ్లపై పారుతోంది. పందుల స్వైరవిహారం, ఖాళీ ప్లాట్లలో నిలిచిన వర్షపు, మురుగు నీటితో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటివరకు అధికారిక లెక్కల ప్రకారం 11 మంది డెంగీ బారిన పడ్డట్లు నిర్ధారించగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో మరో 30 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. ఇటీవల పాతమంచిర్యాలకు చెందిన పదేళ్ల బాలుడు డెంగీ లక్షణాలతో మృతిచెందినా, సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు.

దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలి



వర్షాకాలం కావడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. దోమలు రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలనీలను పరిశుభ్రంగా ఉంచుతూ దోమల మందు పిచికారీ చేస్తే కొంత వరకు తగ్గుతాయి. ఖాళీగా ఉన్న ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరగడం, డ్రెయినేజీ నీరు, వర్షపు నీరు చేరుతోంది. ఖాళీ ప్లాట్లలో వర్షాకాలం ముగిసే వరకు పిచ్చిమొక్కలు పెరగకుండా, వర్షపు నీరు నిల్వ లేకుండా యజమానులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.సుజాత, మంచిర్యాల

పెరుగుతున్న జ్వర పీడితుల సంఖ్య



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జ్వర పీడితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం వైద్యం కోసం వస్తున్న వారి సంఖ్య రోజువారీగా సగటున 250 వరకు ఉంటోంది. వీరిలో గరిష్టంగా 50మందికి పైగా ఆస్పత్రిలో చేరుతున్నారు. ప్రధానంగా వైరల్, టైఫాయిడ్ జ్వరం బాధితులు వస్తున్నారు. డెంగీ, మలేరియా నిర్ధారణ రక్తపరీక్షలు చేయడం లేదు. దీంతో ప్రాణాంతకమైన డెంగీ జ్వర పీడితుల సంఖ్య తెలియకుండా పోతోంది. మలేరియా జ్వరంతో బాధపడుతున్న రోగులు ఎంతమంది వస్తున్నారో నిర్ధారణ కాకుండా ఉంది.

- మురికినీటి గుంతలు, కాలువలు, పిచ్చిమొక్కలు దోమలకు ఆవాసాలుగా మారాయి. మున్సిపాలిటీలోని వార్డుల్లో రోజువారీగా పారిశుద్ధ్య పనులు పనులు చేపట్టక పోవడం, మురికి కాలువల్లో పూడిక తీయించకపోవడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల నివారణకు క్రమం తప్పక ఫాగింగ్ చేయాల్సి ఉండగా ఓ మారు బస్తీల్లో, ప్రధాన రహదారి వెంట ఫాగింగ్ చేసి సరిపెడుతున్నారు.
- ఈ నెల 16న 246 మంది ఆస్పత్రికి రాగా 58మంది ఇన్‌పేషంట్లుగా చేరారు. మరో 70 మంది వైరల్‌ఫీవర్, 27మందికి టైఫాయిడ్ జ్వరం వచ్చినట్లు నిర్ధారించారు.
- 17న 140 మంది అవుట్ పేషెంట్లు రాగా వీరిలో 93 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. 27 మందికి వైరల్‌ఫీవర్, 18 మందికి టైఫాయిడ్ జ్వరం వచ్చినట్లు తేల్చారు.
- 18న 170మంది చికిత్స కోసం రాగా ఇందులో 61 మంది ఆస్పత్రిలో చేరారు. 28 మందికి వైరల్ ఫీవర్, 26 మందికి టైఫాయిడ్ జ్వరం వచ్చినట్లు గుర్తించారు.
- 19న 370 మంది రోగులు రాగా వీరిలో 61 మంది ఆస్పత్రిలో చేరారు. మరో 81 మందికి వైరల్‌ఫీవర్, 28 మందికి టైఫాయిడ్ జ్వరం వచ్చినట్లు తేల్చారు.
- 20న 320 మంది అవుట్ పేషెంట్లు రాగా 58 మంది చికిత్స కోసం చేరారు. మరో 52 మందికి వైరల్ ఫీవర్, 18 మందికి టైఫాయిడ్ జ్వరం వచ్చినట్లు రక్త పరీక్షల్లో వెల్లడైంది. డెంగీ జ్వరం వస్తున్నా రక్త పరీక్షలు చేయకపోవడంతో తీవ్రత తెలియడం లేదు.
- 21న 210 మంది ఓపీ రాగా వీరిలో 62 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. రక్తపరీక్షలు చేసి 58 మందికి వైరల్ ఫీవర్, మరో 19 మంది టైఫాయిడ్ ఉన్నట్లు నిర్ధారించారు.

ప్రతీ వార్డులో బాధితులు

రామకృష్ణాపూర్: వాతావరణంలో మార్పులు, ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వైరల్ జ్వరాలు పంజా విసురుతున్నాయి. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోనూ జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రతీ వార్డులో జ్వర బాధితులు కనిపిస్తున్నారు. జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు వంటి లక్షణాలతో ఆస్పత్రులకు వెళ్తున్న వారే అధికంగా కనిపిస్తున్నారు. స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రిలోనూ ఈ లక్షణాలతో చేరే వారే ఎక్కువగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఒక్క ప్రభుత్వాసుపత్రి కూడా లేకపోవడంతో ఇక్కడి ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. సింగరేణి కార్మిక కుటుంబాలు మినహా వైరల్ జ్వరాలబారిన పడిన వారు మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రులతోపాటు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో నీరు నిలువ ఉన్న చోట దోమల మందు పిచికారీ చేస్తున్నారు. 22 వార్డుల్లోనూ ఫాగింగ్ చేస్తున్నారు. సింగరేణి పరిధిలోని కార్మికకాలనీలలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. కంపెనీ క్వార్టర్ల మధ్యే చెత్త చెదారం పోస్తున్నారు. దోమల నివారణకు కంపెనీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. స్థానిక జవహర్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు ఇటీవలే డెంగీ పాజిటివ్ రాగా ప్రస్తుతం కోలుకుంటోంది.



ఆర్‌కేపీలో రోడ్డుపైనే దర్శనమిస్తున్న చెత్త

న్యూస్‌రీల్

జిల్లాలో 21.4 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం నుంచి గురువారం 21.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మందమర్రి మండలంలో అధికంగా వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన జనం బుధవారం నుంచి వాతావరణం చల్లబడడంతో ఊరట చెందారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు తేలికపాటి ఓ మోస్తారు వర్షం కురుస్తూనే ఉంది. మందమర్రి మండలంలో 73.2 మిల్లీమీటర్లు, భీమారంలో 32.3, కోటపల్లిలో 31, తాండూర్‌లో 31.5, నెన్నెలలో 30.3, చెన్నూర్‌లో 30.8, బెల్లంపల్లిలో 23, కన్నెపెల్లిలో 20.2, కాసిపేటలో 24.1, జన్నారంలో 15.2, లక్సెట్టిపేటలో 14.9, జైపూర్‌లో 12.5, హాజీపూర్‌లో 10, భీమినిలో 9.8, దండేపల్లిలో 7.2, వేమనపల్లిలో 6.4, మంచిర్యాలలో 6.9, నస్పూర్‌లో 6.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇప్పటివరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 902.9 మిల్లీమీటర్లకు గాను 948.6 మిల్లీమీటర్లు నమోదైంది. 5 శాతం అధికంగా ఉంది. 12 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగతా జైపూర్, చెన్నూర్, కోటపల్లి, కాసిపేట, దండేపల్లి మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. భీమిని మండలంలో 24 శాతం లోటు వర్షపాతం నెలకొంది.

‘గుర్తింపు’ పోరు జరిగేనా?

- సింగరేణి కార్మికులకు తప్పని ఎదురుచూపులు
- కోర్టులో కేసు విచారణ, సర్కారు నిర్ణయంపై ఉత్కంఠ
- నేడు మరోమారు ఎన్నికల నిర్వహణపై సమావేశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. అన్ని సజావుగా సాగితే శుక్రవారమే ఎన్నికల షెడ్యూల్ వెలువడాల్సి ఉంది. కానీ.. గుర్తింపు సంఘం ఎన్నిక కాల పరిమితి ఎన్నికలకు ముందే నాలుగేళ్లుగా ఉండాలని హైకోర్టులో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కేసు వేయడంతో విచారణ సాగుతోంది. ఈ క్రమంలో కోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులు వస్తాయనే దానిపై ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంది. గతంలోనే కాల పరిమితిపై కార్మిక శాఖ పరిధిలో ఉంటుందని కోర్టులు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలో తాజాగా కేసుపై ఎలా స్పందిస్తుందోనని కార్మిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఎన్నికల కోసం కార్మిక సంఘాలు రెండేళ్లుగా పట్టుబడుతున్నాయి. ఇందుకోసం పలుమార్లు చర్చలు జరిగాయి. ఈ నెల 22న మరోమారు కార్మిక సంఘాలు, కార్మిక శాఖ కమిషనర్, యాజమాన్యం చర్చించి షెడ్యూల్ వెలువరించాలి. కానీ కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ప్రభావం పడనుంది.



గని కార్మికులు

సర్కారు సహకారమే ప్రధానం

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారమే ప్రధానం కానుంది. పోలీసు, రెవెన్యూ, స్థానిక కలెక్టర్ల పర్యవేక్షణలో ఎన్నికలు జరగాల్సి ఉంది. సంస్థ విస్తరించిన కుమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో స్థానిక పోలీసు, అధికార యంత్రాంగం సహకారం తప్పనిసరి. సింగరేణి ఉద్యోగులతోపాటు మరో 350 వరకు టీచర్లను ఎన్నికల విధుల కోసం కేటాయించాల్సి వస్తుంది. వీరిని ఎన్నికల కోసం డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించాలి. ఇందుకు ఆయా జిల్లాల కలెక్టర్ల ఉత్తర్వులు అవసరం. ఈ మేరకు గతంలోనే ఆయా కలెక్టర్లకు సిబ్బందిని సమకూర్చాలని లేబర్ కమిషన్ నుంచి లేఖలు రాసింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం ఉంటేనే ఆయా జిల్లాల ఉన్నతాధికారులు ముందుకు వెళ్లే అవకాశం ఉంది. ఓ వైపు అక్టోబర్ రెండో వారంలోపు రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ లోపే గుర్తింపు సంఘ ఎన్నికలు జరిగితే ఇబ్బంది ఉండదు. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండడంతో నేడు జరిగే సమావేశం కీలకంగా మారనుంది.

ఈ సమావేశంతోనైనా తేలేనా?

గతేడాది అక్టోబర్ నుంచి హైకోర్టులో కేసులు, విచారణలు, ఎన్నికల నిర్వహణ కోసం సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ వేసిన పిటిషన్ మేరకు మూడు నెలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. చివరగా ఈ నెల 11న హైదరాబాద్‌లో ఆర్ఎల్సీ, యాజమాన్యం, 15కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో ఈ నెల 22న షెడ్యూల్ విడుదల చేయాలని ప్రాథమికంగా అంగీకారం కుదిరింది. ఇందులో ఏఐటీయూసీ, బీఎంఎస్ అదే రోజు షెడ్యూల్ విడుదల చేయాలని పట్టుబట్టినా, మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారు. అంతా అనుకున్నట్లు జరిగితే వచ్చే అక్టోబర్ 27న పోలింగ్ జరగాలి. కానీ హైకోర్టులో కాలపరిమితిపై కేసు విచారణ రావడం, కలెక్టర్లు సైతం సిబ్బంది నియామకానికి ఆసక్తిగా లేకపోవడం వంటి పరిణామాలతో మళ్లీ వాయిదా పడే అవకాశాలే కనిపిస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు వాపోతున్నారు. మెజార్టీ కార్మిక సంఘాలు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే గుర్తింపు సంఘ ఎన్నికలు ఉంటాయా? లేక వాయిదా పడుతాయా? అనేది తేలాల్సి ఉంది.

నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

- నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై చర్యలు
- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: నెలాఖరులోగా సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని, మిల్లులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయని వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, అధికారులు, రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి సంబంధించి వానాకాలం, యాసంగి సీజన్ల ధాన్యం సీఎంఆర్ లక్ష్యంపై రోజువారీ నివేదిక అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్ పాల్గొన్నారు.

యువజన ఓటర్లతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

మంచిర్యాలఅగ్రికల్చర్: యువ ఓటర్లతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ జరుగుతుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, స్వీప్ నోడల్ అధికారి శేషాద్రితో కలిసి హాజరయ్యారు. యువ ఓటర్లతో నేను ‘కచ్చితంగా ఓటు వేస్తాను’ అని ప్రతిజ్ఞ చేయించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. డీఈవో ఎస్ యాదయ్య, ప్రోగ్రాం నిర్వహకులు చౌదరి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, హరిప్రసాద్ పాల్గొన్నారు.



గూడెం వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ సంతోష్

గూడెం గోదావరి తీరాన్ని సందర్శించిన కలెక్టర్

దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరి నదీ తీరాన్ని కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్లు మోతీలాల్, రాహుల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ గురువారం సందర్శించారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆర్డీవో రాములు, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ కృష్ణ, తహసీల్దార్ సంధ్యారాణి, లక్సెట్టిపేట ఎస్సై లక్ష్మణ్, ఎంపీడీవో మల్లేశం పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ

మంచిర్యాలఅర్బన్: సమగ్రశిక్షలో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు గురువారం సమ్మె వీడి విధుల్లో చేరారు. ఉద్యోగులను రెగ్యులరైజ్, కనీస వేతన స్కేలు(ఎంటీఎస్) అమలు పరిష్కారిస్తామని హామీ మేరకు 17 రోజుల అనంతరం ఆందోళన విరమించారు. ఈ మేరకు తాత్కాలిక రిలే నిరవధిక దీక్షలు విరమింపజేసి విధులకు హాజరు కావడానికి అనుమతి ఇవ్వాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు ఉద్యోగులు విన్నవించారు. ఎట్టకేలకు విధుల్లో చేరడంతో సమ్మెకు తెరపడింది.

క్లుప్తంగా

పేకాట టీచర్లపై విద్యాశాఖ సీరియస్?

• రిపోర్టు సబ్‌మిట్ చేయాలని ఎంఈవోకు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅర్బన్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు పేకాట ఆడడాన్ని విద్యాశాఖ సీరియస్‌గా పరిగణిస్తోంది. ఈ నెల 20న 'సాక్షి'లో 'వేయ్ ముక్కేయ్..' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. గురువారం ఈ సంఘటనపై పూర్తి విషయాలు సేకరించి (రిపోర్టు) నివేదించాలని డీఈవో యాదయ్య ఎంఈవోను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు ఎవరెవరూ ఉన్నారో సమగ్ర నివేదిక తర్వాత చర్యలు చేపట్టనున్నారు. టీచర్ల మాటేలా ఉన్నా పేకాట ఆడిన ఇతర డిపార్ట్‌మెంట్ అధికారులపై ఏమేర చర్యలుంటాయో తేలాల్సి ఉంది.

పశువులు ఢీకొని కార్మికునికి గాయాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటిలో పశువులు ఢీకొన్న ఘటనలో సింగరేణి కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కైరిగూడ ఓసీపీలో మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కొండు శంకర్ మంగళవారం పని నిమిత్తం ఐబీ తాండూర్‌కు వెళ్లాడు. బుధవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై గోలేటి టౌన్‌షిప్‌కు వస్తుండగా అంబేద్కర్‌నగర్ వద్ద రోడ్డుపై పోట్లాడుకుంటూ వచ్చిన పశువులు శంకర్‌ను బలంగా ఢీకొట్టాయి. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గోలేటి టౌన్‌షిప్ లోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గోదావరిఖనికి తరలించారు.

పరామర్శించిన జీఎం

బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ సింగరేణి డిస్పెన్సరీలో చికిత్స పొందుతున్న శంకర్‌ను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఆక్రమణల తొలగింపు

నస్పూర్: పట్టణ పరిధిలోని నస్పూర్ శివారు 64 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో వెలిసిన ఫెన్సింగ్‌ను మండల టాస్క్ ఫోర్స్ టీం(రెవెన్యూ, పోలీస్, మున్సిపల్) ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో గురువారం తొలగించారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో వెలసిన ఆక్రమణలను తొలగించామన్నారు.

తప్పుల తడకగా పీజీహెచ్‌ఎం పదోన్నతుల జాబితా

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పీజీ హెచ్‌ఎంల పదోన్నతుల జాబితా తప్పుల తడకగా మారింది. 1994 డీఎస్సీలో పొందిన ర్యాంకుల ఆధారంగా తయారు చేయాల్సిన పదోన్నతుల జాబితాలో తప్పులు నమోదుతో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పైన ఉన్న ఉపాధ్యాయులు కిందకు కింద ఉన్న ఉపాధ్యాయులు పైకి వచ్చే అవకాశాలు ఉండటంతో ర్యాంకులు పడిపోయే అవకాశం ఉంది. దీంతో జూనియర్లు సీనియర్లుగా సీనియర్లు జూనియర్‌గా తారుమారై సీనియార్టీ కోల్పోయి ఎపదోన్నతుల కేటాయింపులో ఉపాధ్యాయులకు నష్టం ఉన్నందువల్ల సవరణ చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 60 నుంచి 70 మంది వరకు స్కూల్ అసిస్టెంట్లు ఉపాధ్యాయులు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఉపాధ్యాయుడు దాదాపుగా 12 నుంచి 15 వరకు ర్యాంకులు కోల్పోయే అవకాశం ఉంది. ఉదాహరణకు శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడు 1994 డీఎస్సీ ద్వారా 2001డిసెంబర్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 1994 డీఎస్సీ ప్రకారం 211 ర్యాంకు కాగా 20 సెప్టెంబర్ 2023 సవరించిన జాబితా ప్రకారం 752గా ఉన్న నెంబర్ 758గా మారింది. దీంతో 211 బదులు 270 నమోదు కావటంతో నష్టపోయే అవకాశం ఉండటంతో 211 ర్యాంకుగా సవరించాలని కోరారు.



మేము సైతం..

• చట్ట సభల్లో ఆమెకు కోటా • మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో ఆమోదం
• 2029 నుంచి మహిళలకు 33 శాతం సీట్లు • హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా లోకం

నారి.. చట్టసభల దారి పట్టనుంది. ఇన్నాళ్లూ పార్టీలు ఆమె బలం చూసో.. దయ తలచో ఇచ్చే టికెట్లతో గెలిచి పార్లమెంట్, అసెంబ్లీలో అడుగు పెట్టేవారు. కానీ ఇక నుంచి హక్కుగా చట్ట సభల్లో అడుగు పెట్టబోతున్నారు. చట్టాల రూపకల్పనలో మహిళలు భాగస్వాములు కానున్నారు. మూడు దశాబ్దాలుగా ఊరిస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో మహిళాలోకం హర్షం వ్యక్తం చేస్తోంది. అయితే 2029 నుంచి కాకుండా వెంటనే అమలు చేయాలని చాలా మంది కోరుతున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మహిళా నేతల అభిప్రాయాలు వారి మాటల్లో..

ప్రాతినిధ్యం దక్కుతుంది



చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలైతే పరిపాలన విధానాల రూపకల్పనలో మహిళలకు ప్రాతినిధ్యం దక్కుతుంది. సమాజంలో గౌరవం పెరుగుతుంది.

– పిల్లి భారతి, సర్పంచ్, రాంపూర్

చరిత్రాత్మకం



దహెగాం: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం చరిత్రాత్మక నిర్ణయం. కొత్త పార్లమెంటు భవనంలో ఈ బిల్లు ప్రవేశపెట్టడం చరిత్రలో నిలిచిపోతుంది. ఈ బిల్లుతో మహిళలు చట్టసభల్లో అడుగుపెడతారు.

– రాపర్తి జయలక్ష్మి, ఎంపీటీసీ, దహెగాం

బిల్లును స్వాగతిస్తున్నాం



నస్పూర్: చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీసుకువచ్చిన బిల్లును స్వాగతిస్తున్నా. దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం నేటికి ఫలించడం సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో చట్ట సభలలో మహిళలకు ప్రాధాన్యం పెరగనుండడం గర్వించదగిన విషయం.

– పంబాల గంగ, కౌన్సిలర్, నస్పూర్

త్వరగా అమలు చేయాలి



కోటపల్లి: మహిళా రిజర్వేషన్ బిల్లుకు వెంటనే చట్టరూపం కల్పించాలి. రాజకీయ లబ్ధికోసం కాకుండా భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఇచ్చేలా నిర్ణయాలు తీసుకోవాలి. జాప్యం చేయకుండా వీలైనంత త్వరగా బిల్లును అమలు చేయాలి. జాగృతి, బీఆర్ఎస్ పోరాటాల ఫలితంగానే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టారు.

– మంత్రి సురేఖ, ఎంపీపీ, కోటపల్లి

మహిళలకు మంచి అవకాశం



కౌటాల: మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంతో మహిళలకు రాజకీయంగా ఎదిగేందుకు మంచి అవకాశం. మహిళలు అన్నిరంగాల్లో రాణించనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. మహిళలు రాజకీయ శక్తిగా ఎదిగినప్పుడే మహిళా సంక్షేమం సాధ్యమవుతుంది. బిల్లును పకడ్బందీగా అమలు చేయాలి.

– డొంగ్రి అనూష, జెడ్పీటీసీ సభ్యురాలు, కౌటాల

రాజకీయ అవకాశాలు పెరుగుతాయి



కౌటాల: భారతదేశంలో పురుషాధిక్యత ఎక్కువ ఉంటుంది. దీంతో చాలా మంది మహిళలు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మహిళలు సైతం రాజకీయల్లో రాణించాలని మహిళా బిల్లు ప్రవేశ పెట్టడం హర్షనీయం. ఈ బిల్లును ఆలస్యం చేయకుండా అమలు చేస్తే మహిళలకు మేలు కలుగుతుంది.

– నికాడే అమ్మక్క, వైస్ ఎంపీపీ, కౌటాల

దేశ చరిత్రలో గొప్ప మలుపు



ఆసిఫాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం దేశ చరిత్రలో ఓ గొప్ప మలుపుగా భావిస్తున్నా. గత పాలకులు కేవలం హామీలకే పరిమితమయ్యారు. ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– వి.పద్మ, గృహిణి, ఆసిఫాబాద్

రాజకీయాల్లో రాణిస్తారు



దహెగాం: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో మహిళలు రాజకీయాల్లో రాణిస్తారు. ఈ బిల్లు ఆమోదం పొందడంతో మహిళలకు గౌరవం ఇచ్చినట్లయింది. ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న బిల్లు ఆమోదం పొందడం సంతోషకరం. ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగా భావిస్తున్నాం.

– సులోచన, ఎంపీపీ, దహెగాం

సుమన్ ఆగడాలు భరించలేకే కాంగ్రెస్‌లోకి..

• మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న నల్లాల ఓదెలు, భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆగడాలను భరించలేకనే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లామని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ చెన్నూర్ నియోజక వర్గంలో సుమన్ రజాకార్ మాదిరిగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. అభివృద్ధి పనుల పేరిట నిధులు మంజూరు చేయించి కమీషన్ నొక్కడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. కాంగ్రెస్ గెలుపుకోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సమావేశంలో దుర్గం నరేష్, ఇబ్రహీం, నల్లాల చలపతి, బచ్చలి భీమయ్య, ప్రభాకర్, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

'ఓదెలు దంపతులకు పార్టీ అన్యాయం చేయలేదు'

మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి దంపతులకు బీఆర్ఎస్ పార్టీ ఎలాంటి అన్యాయం చేయలేదని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఓదెలును ఉద్యమ నాయకునిగా గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారన్నారు. 2018 ఎన్నికల్లో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన చెందితే భాగ్యలక్ష్మిని జెడ్పీ చైర్‌పర్సన్ చేశారని గుర్తుచేశారు. సమావేశంలో జెడ్పీటీసీ వేల్పుల రవి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగిలి రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, నాయకులు మద్ది శంకర్, రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అండర్–14 రెజ్లింగ్ పోటీలలో లక్సెట్టిపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన గరిసె భువనేశ్వరి 38 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి గురువారం తెలిపారు. ఈ నెల 23 నుంచి 26 వరకు తొర్రూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థిని పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కావ్యకు రాష్ట్రస్థాయి ర్యాంకు

లక్సెట్టిపేట: 2023 మేలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈఈ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో లక్సెట్టిపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నల్ల చంద్రయ్య, సునీత దంపతుల కుమార్తె కావ్య రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈఈఈ విభాగంలో బీటెక్ పూర్తి చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు జిల్లా న్యాయవాదులు

ఆసిఫాబాద్: ఈ నెల 23, 24 తేదీలలో ఢిల్లీలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ లాయర్స్ కాన్ఫరెన్స్–2023లో పాల్గొనేందుకు జిల్లా కేంద్రానికి చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్ బాబు, ప్రధాన కార్యదర్శి రాపర్తి రవీందర్‌కు ఆహ్వానం అందింది. గురువారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో వారు మాట్లాడుతూ 23న ఉదయం 8.15 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభమవుతుందని, దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్షులతో పాటు విదేశాల నుండి కూడా న్యాయవాదులు హాజరుకానున్నట్లు తెలిపారు. పలు హైకోర్టుల న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు పాల్గొని న్యాయవాదులకు సంబంధించిన పలు చట్టాలపై చర్చించనున్నట్లు వారు పేర్కొన్నారు.

'కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి'

నస్పూర్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. గురువారం కార్మికులతో కలిసి శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం సంజీవరెడ్డికి అందజేశారు. కె.నర్సయ్య, ఎం.శంకర్, అప్పారావు, బక్కయ్య, రమేశ్, కిరణ్, ఈశ్వర్, శోభ, రమ, సుగుణ, మేరీ, హంస, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన బుర్రి శ్రీనివాస్ (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11న శ్రీనివాస్ కూలిపనికి వెళ్లాడు. మరుసటి రోజు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి 20న మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఇంగు శంకర్, తాటి మల్లేశ్ చితకబాదడంతోనే మృతి చెందాడని మృతుని భార్య శ్రీలత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

'హెల్త్ మేళా సద్వినియోగం చేసుకోవాలి'

మంచిర్యాలటౌన్: ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న లక్సెట్టిపేట్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఎన్‌టీ, గైనిక్, చిన్నపిల్లల సమస్యలు, కంటి సంబంధిత సమస్యలకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జానయ్యకు రక్షణ కల్పించాలని వినతి

చెన్నూర్: ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యకు రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం ఢిల్లీలోని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారంకు వినతిపత్రం అందజేసినట్లు యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేశ్ తెలిపారు. వట్టె జానయ్య ఎదుగుదలను ఒర్వలేని మంత్రి జగదీశ్వర్‌రెడ్డి తన అనుచరులతో అతనిపై దాడులు చేయించి అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారన్నారు. మంత్రి అండతో పోలీసులు అతన్ని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. జానయ్యతో పాటు అతని కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు.

విద్యారంగానికి నిధుల కేటాయింపుపై వివక్ష

• ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠ

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో విద్యారంగానికి నిధుల కేటాయింపుపై కేసీఆర్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ ఆరోపించారు. గురువారం సీపీఐ కార్యాలయంలో మంచిర్యాల జిల్లా ఏఐఎస్ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా తాత్సారం చేయడంపై మండిపడ్డారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆసరాగా ఉండే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయడంలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచడం లేదన్నారు. అంతకు ముందు పలువురు విద్యార్థులు ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీగౌడ్, సహాయ కార్యదర్శి సయ్యద్, నాయకులు మొగిలి, కుతుబ్, అరుణ్, జతిన్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా రమణ



రమణ, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు

మంచిర్యాలటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రమణ(ఈఎన్‌టీ) ఎన్నికయ్యారు. అధ్యక్షుడితోపాటు కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు చీఫ్ ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్.మల్లేశ్, కో ఎన్నికల అధికారులు డాక్టర్ జి.భద్రినారాయణ, డాక్టర్ లక్ష్మీనారాయణ కాటమ్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కేవీఎల్ఎన్ మూర్తి, కోశాధికారిగా డాక్టర్ కేఎంఎన్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వైద్యులు ఆర్.రవిప్రసాద్, గోలి పూర్ణచందర్, ఎన్.శ్రీనివాస్, ఏ.స్వరూపరాణి, కె.పద్మ, జాయింట్ సెక్రెటరీలుగా వైద్యులు ఎస్.కళావతి, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా వైద్యులు జి.అన్నపూర్ణ, ఆర్.కీర్తి, వై.శ్రీనివాస్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులుగా బి.రఘునందన్, ఎస్.శరత్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ బి.వంశీకృష్ణ, డాక్టర్ సీహెచ్.రాధిక, డాక్టర్ బి.రాజేందర్, డాక్టర్ సీహెచ్ సంతోష్, డాక్టర్ బి.ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు. కాగా, అధ్యక్షుడు రమణను పలువురు ఘనంగా సన్మానించారు. నస్పూర్ మాజీ సర్పంచ్ రాచకొండ గోపన్న, బీఆర్ఎస్ నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, గొంగళ్ల శంకర్, నరెడ్ల శ్రీనివాస్, శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల ఖాతాల్లోకి 'ఏరియర్స్'



బెల్లంపల్లి ఏరియాలో అత్యధిక ఏరియర్స్ పొందిన ఉద్యోగికి చెక్కు అందిస్తున్న జీఎం రవిప్రసాద్

• 23 నెలల వేతన బకాయిలు విడుదల చేసిన సింగరేణి
• ఒక్కో కార్మికుడికి సగటున రూ.3.75 లక్షలు

రెబ్బెన/నస్పూర్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ డబ్బులను గురువారం ఒకే దఫాలో చెల్లించింది. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు డైరెక్టర్ (ఫైనాన్స్, పర్సనల్) ఎన్.బలరాం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుండి ఆన్‌లైన్‌లో 39 వేల మంది కార్మికులకు వేతన బకాయిలు చెల్లించారు.

ఒక్కో కార్మికుడికి సగటున రూ.3.75 లక్షలు

11వ వేతన ఒప్పందం చర్చలు 2021 జూలైలో జరగాల్సి ఉండగా జాతీయ కార్మిక సంఘాల డిమాండ్లకు బొగ్గు సంస్థలు అంగీకరించకపోవటంతో పలుదఫాలు వాయిదా పడ్డాయి. ఎట్టకేలకూ బొగ్గు సంస్థలు అంగీకారం తెలపడంతో 23 నెలల అనంతరం 2021 నుండి జూలై నుంచి పెరిగిన వేతనాలకు సంబంధించిన ఏరియర్స్‌ను సింగరేణి యాజమాన్యం విడుదల చేసింది. ఒక్కో ఉద్యోగికి సగటున సుమారు రూ.3.75 లక్షలు పొందగలిగారు. కాగా ఆర్జీ–1 ఏరియాకు చెందిన వేముల సుదర్శన్‌రెడ్డి రూ.9.91 లక్షలతో సింగరేణి టాపర్, ఆర్జీ–2 ఏరియాకు చెందిన మీర్జా ఉస్మాన్‌బేగ్ రూ.9.35 లక్షలతో ద్వితీయస్థానంలో, శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన హెడ్‌ఓవర్‌మెన్ ఆడెపు రాజమల్లు రూ.9.16 లక్షలతో తృతీయస్థానంలో నిలిచారు. బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో డైటీషియన్‌గా పనిచేస్తున్న ఎస్.విజయలక్ష్మి రూ.5.40 లక్షలు పొంది ఏరియాలో అత్యధిక ఏరియర్స్ పొందిన ఉద్యోగిగా నిలిచారు. అత్యధిక ఏరియర్స్ పొందిన ఉద్యోగులను ఏరియా జీఎం రవిప్రసాద్ శాలువాలతో సత్కరించి చెక్కులు అందజేశారు. ఒకే దఫాలో బ్యాంకు ఖాతాలో డబ్బులు జమకావడంతో కార్మికులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఐటీ

సంవత్సర ఆదాయం రూ.10 లక్షలలోపు ఉన్న వారికి 20శాతం, ఆపై వారికి 30 శాతం ఐటీ చెల్లిస్తున్నారు. అయితే ప్రస్తుతం చెల్లించిన ఏరియర్స్ ఈ ఆర్థిక సంవత్సరంలో కార్మికులు పొందిన ఆదాయంగా యాజమాన్యం పరిగణలోకి తీసుకుంటుడటంతో ఒక్కో కార్మికుడు రూ.50వేల నుండి రూ. లక్ష వరకు ఐటీ చెల్లించాల్సి వస్తోంది. ఏరియర్స్‌లోంచి 12 శాతం పీఎఫ్, 7 శాతం పెన్షన్ కోసం కోత విధించగా మిగిలిన మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.

అనుకున్నంత రాలేదు



11వ వేతన ఒప్పందంలో కార్మికులు ఆశించిన స్థాయిలో వేతనాల్లో పెరుగుదల లేకపోవడంతో ఏరియర్స్ డబ్బులు అనుకున్న స్థాయిలో రాలేదు. జాతీయ కార్మిక సంఘాలు మెరుగైన వేతన ఒప్పందం చేసుకుని ఉంటే కార్మికులు మరింత లాభం చేకూరేది. కొన్ని కార్మిక సంఘాలు సింగరేణి ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ దుష్ప్రచారం చేశాయి.

– మల్రాజు శ్రీనివాస్‌రావు, టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు

మెరుగైన వేతన ఒప్పందం



గతంలో ఎన్నడూ లేని విధంగా 11వ వేజ్‌బోర్డులో కార్మికులకు వేతనాలు పెరిగాయి. కాస్త ఆలస్యమైనప్పటికీ గతంలో కంటే మెరుగైన వేతన ఒప్పందాన్ని జాతీయ కార్మిక సంఘాలు సాధించాయి. భవిష్యత్‌లోనూ కార్మికులకు మరిన్ని హక్కులు సాధించేందుకు జాతీయ కార్మిక సంఘాలు యాజమాన్యాలతో పోరాడుతూనే ఉంటాయి.

– ఎస్.తిరుపతి, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి

అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ



విచారణ జరుపుతున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

జన్నారం: మండలంలోని రేండ్లగూడకు చెందిన బాల్త రాజమౌళి, సంతోష్‌పై నమోదైన అట్రాసిటీ కేసు విషయంలో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి గురువారం విచారణ జరిపారు. గ్రామానికి వెళ్లి బాధితుడు దస్తగిరితో మాట్లాడారు. సాక్షులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై సతీశ్ ఉన్నారు.

'ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికంటే ముందుగా కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీఎస్ ఆర్టీసీ ఈయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 26న ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, బీకేయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం మంచిర్యాల డిపో వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2017, 2021 పెండింగ్ పేస్కేల్ వెంటనే అమలు చేయాలని, 2023 జూలై డీఏ అమలు చేయాలని, సీసీఎస్ బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి గోలి శంకర్, జోనల్ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, శ్రీధర్, డిపో కమిటీ సభ్యులు రాజయ్య, రాజేశం, శ్రీధర్, నారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ పర్సనల్ డీజీఎంకు వీడ్కోలు



నారాయణరావును సన్మానిస్తున్న అధికారులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో పర్సనల్ డీజీఎంగా విధులు నిర్వర్తిస్తున్న కేసా నారాయణరావు ఇటీవల కార్పొరేట్ ఈఈ సెల్ విభాగానికి బదిలీ అయ్యారు. గురువారం అడ్మిన్ భవన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం బసివిరెడ్డి, అధికారులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారులు ప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, రామశాస్త్రి, సముద్రాల శ్రీనివాస్, ప్రభాకర్ రావు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు'

పాతమంచిర్యాల: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జాతీయ మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు గజెల్లి రాజమల్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతపురి జనార్దన్ అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్లకార్డులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో దళితులను విభజించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్తెపు శంకరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల నరేష్, ప్రచార కార్యదర్శి సొల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.